

# మనిషీ-విలువ

విజయపురి మహారాజు, మంత్రితో కలసి మారు వేషంలో ఒకరోజు నగర సంచారానికి బయలు దేరాడు.

నగర శివార్లలోని ఒక చెట్టుకింద ఒక మనిషి చచ్చిపోయి ఉండడం చూశారు. అతనిది దిక్కు లేని చావు. అతను పోయినందుకు విచారించే వారు ఎవరూ లేరు. ఎవరయినా ఆ శవాన్ని చూసి నగరపాలక అధికారులకు తెలిపితే, ఖననానికి ఏర్పాట్లు జరుగుతాయి. కాని ఎవరి మటుకు వారు చూసి చూడనట్లు వెళుతున్నారుగాని, ఫిర్యాదు చెయ్యలేదు.

రాజుగారికి ఎంతో జాలివేసింది. ఆ మాటే మంత్రితో అన్నాడు.

“ప్రభూ! డబ్బులేని వ్యక్తి చచ్చినా, బతికి వున్నా విలువలేదు” అన్నాడు మంత్రి.

“అతను ఈ విధంగా చనిపోవడం అతని తల రాత కాదంటావా?” అని ప్రశ్నించాడు మహారాజు.

“ఎంతమాత్రం కాదు. ప్రయత్నం చెయ్యని వాడికి ఏ దేవతా సహాయపడదు. శరీరంలో జవ సత్వాలు, శక్తిసామర్థ్యాలు ఉన్నప్పుడు కష్టపడి జీవించే వృత్తి స్వీకరించక, సులభంగా కడుపు నింపుకోడానికి భిక్షం ఎత్తడం ప్రారంభించాడు. కాని ఏమాత్రం లోకజ్ఞానమున్నా సరే ప్రయత్నించి విజయం పొందేవాడేమో. అప్పుడు ఇతని శవాన్ని ఊరేగించి మరీ తీసుకు వెళ్ళేవారు,” అన్నాడు మంత్రి.

రాజుకి మంత్రి మాటలు ఏమాత్రం నచ్చలేదు.

“అయితే మనిషికి డబ్బే ప్రధానమా?” అని రాజు అనగానే మంత్రి తడుముకోకుండా “అవును” అన్నాడు.

అంతటితో ఆగకుండా “నిరూపించగలను” అని కూడా అన్నాడు.

“నగర శివార్లలో చనిపోయిన ఒక ముష్టివాడి శవం రాజుగారి కోటలో వుందనీ, అతని బంధు

వులు ఎవరైనా వుంటే శవాన్ని తీసుకు వెళ్ళ వలసిందనీ, అతను యాచనవల్ల సంపాదించు కున్న వెయ్యి వరహాల సొమ్ముకూడా వారికి అంద చేయబడుతుందనీ" ఆ రోజు సాయంత్రం మంత్రి నగరంలో చాటింపు వేయించాడు.

చాటింపు విని చనిపోయిన ముష్టివాడి భార్యల మని నలుగురు స్త్రీలు వచ్చారు. ఆ చనిపోయినది మా తమ్ముడే అని ఓ పదిమంది నడి వయసు వారు వచ్చారు. చనిపోయిన ముష్టివాడు మా తండ్రి అంటూ మరో పాతిక మంది యుక్త వయస్కులు వచ్చారు.

మంత్రి వారందరినీ సభలోనికి రావడానికి ప్రవేశార్హత కల్పించాడు.

"ప్రభూ! వీరంతా చనిపోయిన ముష్టివాడి భార్యలు, అన్నలు, కొడుకులమనీ వచ్చారు," అన్నాడు.

"మంత్రీ! ఒక్కడికి యింత మంది భార్యలు, కొడుకులూనా? ఇది ఎలా సాధ్యం?"

"అసాధ్యమే ప్రభూ! వీరిలో నిజమైన వారిని ఎన్నిక చేయాల్సి ఉంటుంది," అన్నాడు మంత్రి.

రాజుకు మంత్రి ఏరకంగా ఎన్నిక చేస్తాడో నన్న కుతూహలం కలిగింది. "కానివ్వండి" అని అను మతి ఇచ్చాడు.

మంత్రి అందరినీ రకరకాలుగా ప్రశ్నించాడు. సంతృప్తికరమైన జవాబు ఒక్కటి రాలేదు. అందరూ తలో రకంగానూ చెప్పారు.



నిజమైన వారసులను తేల్చడం మంత్రికి సాధ్యం కాలేదు.

"ప్రభూ! నిజమైన వారసులను తేల్చడం నావల్ల కావడం లేదు. అందువల్ల అతని ఆస్థిని అందరికీ సమానంగా పంచడానికి అనుమతిం చండి," అని కోరాడు మంత్రి.

"సరే!" అన్నాడు రాజు.

ముష్టివాడి తలకింద వున్న సంచిలోని వరహాలను ఒక పళ్లెంలో గుమ్మరించాడు మంత్రి.

వారసులమని వచ్చినవారు 'ఊరికే వచ్చేది ఎంతో కొంత' అనుకుని ఎంతో సంతోషించారు.

ఆ సంచీ అడుగు నుంచి ఒక చీటి కింద పడింది.

దానిని మంత్రి చదివి, మిగతా వారికి ఈ విధంగా చెప్పాడు: "ఈ ముష్టివాడి పేరు పురుషోత్తముడు. విలాసాలకు లోనయి ఆస్థిని పోగుట్టుకున్నాడు. అప్పుల పాలయ్యాడు బంగారు దుకాణంలో మూడువేల బాకీ యింకా అలానే వుంది. అతని పేరు రవివర్మ. అతని అప్పు తీర్చడం కోసం ఏన్నో పనులు చేశాడుట. చివరకు ముష్టికూడా ఎత్తాట్ట. తన శక్తి అయిపోయిందనీ, రేపో, మాపో తన చావు ఖాయమనీ, తను కూడబెట్టిన ఈ వెయ్యి వరహాలు రవివర్మకు అందచేయమనీ కోరాడు. మిగతా అప్పు తన భార్య పిల్లలు తీర్చి తన్ను ఋణవిముక్తుడిని చేయాలని అతని కోరికట," ఆ తరవాత మంత్రి రాజుతో "ప్రభూ వీరందరికీ మిగిలిన అప్పు రెండువేల వరహాలు సమానంగా పంచుతాను," అన్నాడు.

రాజు సరేనంటూ తల వూపాడు.

మంత్రి మాటలు విని వారసులమని వచ్చిన వారు పరుగుతీశారు.

"ప్రభూ! మనిషి విలువ ప్రత్యక్షంగా చూశారు గదా?" అన్నాడు మంత్రి.

రాజు "అర్థమయింది" అంటూ తలవూపాడు.

